
క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: శ్రీ మహాలక్ష్మి జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి ఆలయంలో అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి జరిగిన స్నపన తిరుమంజనంలో కురువేరు, తెల్లపట్టు, ఎండుఫలాలు, వట్టివేరు, పసుపు రోజా మాలలను అలంకరించారు. సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ పుర వీధుల్లో గరుడ వాహనంపై భక్తులను స్వామివారు అనుగ్రహించారు. ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సొమ్ము భద్రం.. భవిత బంగారం



సత్తెనపల్లి: పోస్ట్ ఆఫీస్ సేవలతో.. సొమ్ము భద్రంగా.. భవిత బంగారంగా ఉంటుందని సత్తెనపల్లి హెడ్ పోస్ట్‌మాస్టర్ జె.రామకృష్ణ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీకేబీవై ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత నమ్మకమైన పోస్ట్ ఆఫీస్ పొదుపు, ఇన్సూరెన్స్ పథకాలు ఎస్‌బీ, ఎఫ్‌డీ, ఎంజెడ్ఎస్, ఎంఎస్సీ, కేవీపీతో పాటు తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాల్లో చేరి నమ్మకమైన రాబడులు పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఎక్కువ ఖాతాలు చేసిన మహిళా ఎంపీకేబీవై ఏజెంట్లకు జ్ఞాపికలు అందించి, సత్కరించారు.

సామూహిక పూజలు



సత్తెనపల్లి: ఐదు లాంతర్ల సెంటర్‌లోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో లక్ష్మీదేవి అమ్మవారి జన్మదినం సందర్భంగా ఆర్యవైశ్య మహిళా నాయకురాలు కోటా నాగ వరలక్ష్మి ఆధ్వర్యంలో అష్టలక్ష్మి అమ్మవారికి సామూహిక పూజా కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆర్యవైశ్య మహిళా నాయకులు కోటా నాగ వరలక్ష్మి, జవ్వాజి లక్ష్మి, పెరుమాళ్ళ రాజ్యలక్ష్మి, కటకం అనంతలక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పూజలో 200కు పైగా మహిళలు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం



క్రోసూరు: క్రోసూరు మార్కెట్ యార్డులో మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. చైర్మన్ ఈదా సాంబిరెడ్డి ఆదేశాల మేరకు ఉద్యోగులు పద్మ, యంకాయమ్మను సన్మానించారు. యార్డు సెక్రటరీ శంకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల



అచ్చంపేట: కోనూరులో స్వయంభుగా వెలసిన లక్ష్మీ తిరుపతమ్మతల్లి తిరునాళ్ల మహోత్సం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ నడిబొడ్డున కుంటలో అమ్మవారు వెలిశారు. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గోపయ్య సమేత తిరుపతమ్మతల్లికి కల్యాణం నిర్వహించారు. పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు మూడు విద్యుత్ ప్రభలను నిర్మించి తమ భక్తిని చాటుకున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పి.సురేష్ బుధవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. వారి వద్ద నుంచి రూ.2010 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కుటుంబ వ్యవస్థలో మహిళ పాత్ర కీలకం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు



ఎస్‌ఐ తులసిని సత్కరిస్తున్న ఆర్డీఓ రాజకుమారి తదితరులు

సత్తెనపల్లి: కుటుంబ వ్యవస్థలో మహిళ పాత్ర కీలకమని సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి అన్నారు. పట్టణంలోని మదర్ థెరిస్సా ఆసుపత్రిలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డలకు జన్మనిచ్చి వారికి చదువులు, సత్ప్రవర్తన నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దడంలో మహిళ కృషి అద్భుతమన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ, ఎస్‌ఐ తులసి మాట్లాడారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు, డాక్టర్ అనిత, డాక్టర్ అనూష, డాక్టర్ దిలీప్, సుజాత పాల్గొన్నారు.

వాడ వాడలా వేడుకలు...

పట్టణంలోని 11వ సచివాలయ పరిధిలోని 19, 20 వార్డుల్లో కౌన్సిలర్లు కూకట్ల లక్ష్మి, అవ్వారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్, ఆంధ్ర ప్రదేశ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో శాంతినికేతన జూనియర్ కళాశాల నందు, లయన్స్ క్లబ్, దళిత బహుజన రీసోర్స్ సెంటర్, కెనరా బ్యాంక్‌లో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్ఆర్ సీపీ కోఆప్షన్ సభ్యురాలు తుమ్మల లక్ష్మీ సుజాత, సచివాలయ ఉద్యోగులు, బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, పాయసం మహేష్, తవిటీ భావ నారాయణ, వల్లూరి శ్రీనివాసరావు, కంబాల వెంకటేశ్వరరావు, మల్లెల చిన్నప్ప, నందిగామ చిట్టిబాబు, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, కొరబండి ఆంథోని, జిల్లెళ్ల పాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం..

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ):చాగంటివారిపాలెం ఆర్బీకేలో దళిత బహుజన రీసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డీబీఆర్సీ పల్నాడు జిల్లా కో కన్వీనర్ మేడె వెంకటరమణ పాల్గొని, మాట్లాడారు. పలు రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను తోటి మహిళలు ఘనంగా సన్మానించారు. ఐకేపీ ఏపీఎం బాలస్వామి, సీసీ నాగరాజు, ఎమ్మెస్ అధ్యక్షురాలు రాములమ్మ, ఆండాళ్ళు, చిన్నమ్మాయి, కృష్ణవేణి పాల్గొన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మారూరి పద్మ, జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న మహిళలతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు



చాగంటివారిపాలెం ఆర్బీకేలో మహిళలకు సన్మానం

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



రెంటపాళ్ళలో సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరిస్తూ లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధి చేకూరిన బుక్‌లెట్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలతో పచ్చచొక్కాలు ధరించిన వారికే పథకాలు అందేవని గుర్తుచేశారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏకుల మనీషా, ఎంపీటీసీ నక్కా పద్మ, వైఎస్ఆర్ సీపీ సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత్ శివ ప్రసాద్, నాయకులు షేక్ ఎలవర్తిపాటి ఈసా, చిలుకా జయపాల్, చల్లా శ్రీనివాసరావు, కొమెర శివశంకర్, పల్లె గాబ్రియేలు, మారిశెట్టి సైదయ్య, సాంబ, సహదేవుడు, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు ఉన్నారు.

నేడు రెంటపాళ్ళలో..

రెంటపాళ్ళ గ్రామంలో గురువారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్ఆర్ సీపీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు తెలిపారు. మంత్రి అంబటి రాంబాబు ఇంటింటికీ సంక్షేమ పథకాలను వివరిస్తారని పేర్కొన్నారు.

రాజుపాలెం ఎస్‌ఐగా నారాయణ



రాజుపాలెం: క్రైం బ్యాంచ్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న నారాయణ బదిలీపై రాజుపాలెం మండలం ఎస్‌ఐగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ మహ్మద్ షఫీ బదిలీపై క్రైం బ్యాంచ్ ఎస్‌ఐగా వెళ్లారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ మండల నాయకులకు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో మండల నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల పురోగతిపై వారితో చర్చించారు. కొత్తగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయ సహకారాలకు తనను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండలంలోని పార్టీ నాయకులు అనుముల కోటిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, తుమ్మపూడి ప్రతాప్‌రెడ్డి, గ్రామ వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్, గార్లపాటి దాసు, అనుముల శ్రీనివాసరెడ్డి, షేక్ ఖాదర్, షేక్ గఫూర్, నారు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతో హక్కులు సాధించుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రత్నకుమార్

అమరావతి: మహిళలు తమ హక్కులను సాధించుకోవాలంటే మరింత చైతన్యమవ్వాలని గుంటూరు జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రత్నకుమార్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ సమావేశంకు సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ లలిత కుమారి అధ్యక్షత వహించారు. గుడ్ షెపర్డ్ సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసీ, డీసీపీఓ విజయ్, సిస్టర్స్ దయానా, ఝాన్సీ, సర్పంచ్ కంభంపాటి సుధారాణి, లక్ష్మణ్, రవిశేఖర్, ఇందిరాదేవి ప్రసంగించారు.

సూచనలను పాడి రైతులు పాటించాలి



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, వైద్యులు

బెల్లంకొండ: పాడి రైతులు, పశుపోషకులు పశు సంవర్ధకశాఖ అధికారుల సలహాలు పాటించాలని ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని మాచాయపాలెం గ్రామంలో బుధవారం ఆ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. నలభై పశువులను పరీక్షించి, తగిన చికిత్స అందించినట్లు రాజుపాలెం ఏడీఏ డా.జి. వీరయ్య తెలిపారు. అనంతరం పశువులకు రక్తం, పేడ పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదిగోపాలరావు, ఎంపీపీ శ్రావణిబాయి, చిట్యాల సర్పంచ్ నరసింహానాయక్, మొక్కపాడు వైద్యుడు నాగేశ్వరరావు, గోపాలమిత్రలు వెంకటేశ్వరరావు, నాగార్జున, కాశీరావు, ఉపసర్పంచ్ కొండెబోయిన మంగాయమ్మ, శ్రీనివాసరావు, గ్రామ నాయకులు భూపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి ఏంతో పవిత్రమైనది



వైద్యులకు జ్ఞాపికలు అందిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

సత్తెనపల్లి: నర్సింగ్ ఎంతో పవిత్రమైనదని ప్రముఖ గైనకాలజిస్ట్, సంజన స్పెషాల్టీస్ వైద్యశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ గిరిజ అన్నారు. పట్టణంలోని వేద కళాశాల 29వ వార్షికోత్సవం సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులకు కాప్‌ల బహూకరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా బుధవారం విచ్చేశారు. సభకు అకడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్ అధ్యక్షత వహించారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ గజ్జల శారదారెడ్డి మాట్లాడుతూ తల్లితండ్రుల ఆశలకు అనుగుణంగా చదువుకొని ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదమక్కెన ప్రభుత్వ పశువైద్యురాలు డాక్టర్ శిరీష, డాక్టర్ ఫణి ప్రశాంతి, ప్రభుత్వ హాస్పిటల్ హెడ్ నర్స్ రమణమ్మ, యువ డాక్టర్ చింతాడ ప్రత్యూష పాల్గొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా అధ్యాపకులు, డాక్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా డైరెక్టర్ ప్రభావతి, చింతాడ రమేష్ తదితరులున్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బాలికల జట్టు ఎంపిక



శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జూనియర్ బాలికల విభాగంలో (అండర్–19) ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించినట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ఈఎంపిక పోటిలను గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సెక్రటరీ ఈ.శివశంకర్ పర్యవేక్షించారు.ఎంపికైనా జూనియర్ బాలికలు ఈనెల 17 నుంచి 19 తేదీ వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే 7వ అంతర్ జిల్లాల పోటిల్లో పాల్గొంటారన్నారు.ఎంపికై న విద్యార్థినులు యం.లిఖిత (కనమర్లపూడి) ఎస్‌కె. సమీరా (పసుమర్రు) ఆకుమళ్ళ సమీరా, ఓర్చు స్రవంతి, ముట్లూరి లూధియా, వి.దివ్య, వి.బసవరాణి, బి.దేవమణి, కె.కావ్య (శావల్యాపురం) సీహెచ్. హర్షిత, అమూల్యా (నరసరావుపేట) స్టాండ్ బైస్‌గా టి. అంజన, హర్షిత, బి.రవళి (శావల్యాపురం) ఉమ్మడి గుంటూరు జట్టుకు ఎంపికైనట్లు పీడీ రాధాకృష్ణమూర్తి తెలిపారు.

• పల్లెకు కొత్త హంగులు..

పల్లెకు కొత్త హంగులొచ్చాయి. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధనలో.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణకు ఇవి నిదర్శనాలు. ప్రజల ఇళ్ల ముంగిటకొచ్చిన పాలనకు సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ప్రత్యక్ష సాక్ష్యాలు. ముప్పాళ్ల మండలంలోని గోళ్ళపాడు, చాగంటివారిపాలెం గ్రామాల్లో నూతన సచివాలయాల భవనాలు, గోళ్ళపాడులో వైఎస్సార్ విలేజ్‌క్లినిక్, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ నెల 10న శుక్రవారం వాటిని ప్రారంభించనున్నారు. అలాగే రూ.42లక్షలతో ఆధునీకరించిన తహసీల్దార్ కార్యాలయం, అందులో స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రాన్ని ప్రారంభించి, అక్కడే ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. సాయంత్ర 4గంటలకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటిరాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, నరసరావుపేట ఎమ్మెల్యే డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాదు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పాల్గొని, భవనాలను ప్రారంభించనున్నారు.

– ముప్పాళ్ళ



ఆవిష్కరించనున్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం



చాగంటివారిపాలెం గ్రామ సచివాలయం



ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్



ఆధునీకరించిన తహసీల్దార్ కార్యాలయం

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్యప రీక్షలు చేస్తున్న వైద్యులు

నకరికల్లు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కంటి శుక్లం ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నామని నరసరావుపేటకు చెందిన కంటి వైద్య నిపుణులు ఫణీంద్రకుమార్ తెలిపారు. స్థానిక సచివాలయం –1లో స్కందన్ నేత్రాలయ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 92మందికి పరీక్షలు చేసి, 36మందికి శుక్లం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి వైద్యం ఉచితంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడు జ్ఞానయ్య మృతి



జ్ఞానయ్య మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట: గ్రంథశిరి ఎంపీటీసీ సభ్యుడు చిల్కా జ్ఞానయ్య (45) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన సంతాపం తెలిపారు. పార్టీ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట క్రోసూరు ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీ నాయక్, రావెళ్ల శ్రీనధర్, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్లరి మూకల స్వైర విహారం

నరసరావుపేట: పట్టణంలోని ప్రకాష్‌నగర్ ఆర్టీసీబస్టాండ్–రైల్వేస్టేషన్‌రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొందరు యువకులు కర్రలు చేబూని పెద్దగా కేకలు వేస్తూ స్వైర విహారం చేశారు. ఇళ్లముందు నిల్పోబెట్టబడిన వాహనాలను కిందపడేశారు. రోడ్డు మార్జిన్లలో టిఫిన్ బండ్ల సామాగ్రిని కర్రలతో కొట్టి ధ్వంసం చేశారు. వారందరూ మద్యం సేవించి ఉన్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. తమపై దాడిచేస్తారనే కారణంతో చూసిన వారెవరూ నివారించలేదు. నైట్ బీట్ పోలీసుల జాడ కన్పించలేదు. ఇదిలా ఉండగా బర్తడే వేడుకలు అంటూ అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై ద్విచక్రవాహనాలను నిలబెట్టి కేకులు కట్‌చేస్తూ బాణాసంచాలు కాల్చి పెద్దగా కేకలు వేయటం పరిపాటిగా మారింది. ఆ సమయంలో ఇళ్లల్లో గాఢనిద్రలో ఉన్న వారందరూ వారు చేసే గొడవకు ఉలిక్కిపడి లేచి ఏమిజరిగిందోనంటూ బయపడుతున్న సందర్భాలు అనేకం.